సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



జేఈఈలో మెరిసిన మనోళ్లు
జేఈఈ మెయిన్స్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం రాత్రి ఎన్‌టీఏ ఈ ఫలితాలను వెల్లడించింది. IIలో



మొక్కల సంరక్షణకు చర్యలు
రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం పేరిట ఏటా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. ఈ మేరకు వాటిని ముందుగా ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో సిద్ధం చేస్తున్నారు. IIIలో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.0/27.0
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల గోదాం తనిఖీ



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ఈవీఎంలను భద్రపర్చిన గోడౌన్‌ను కలెక్టర్ రాజర్షి షా శనివారం పరిశీలించారు. ప్రతీ నెల తనిఖీలో భాగంగా గోడౌన్‌ను సందర్శించి స్ట్రాంగ్‌రూం భద్రతను పర్యవేక్షించారు. అనంతరం అక్కడి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పంచపూల తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎంపికైన విద్యార్థులకు ఇంటర్, ఎఫ్‌సెట్ కార్పొరేట్ విద్య అందించేందుకు గాను జిల్లాలోని ఆయా ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దళితాభివృద్ధిశాఖ అధికారి సునీత కుమారి ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల ప్రిన్సిపాళ్లు ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం సంబంధిత పత్రాలను కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. కళాశాల అనుమతి ధ్రువీకరణ పత్రం, వసతులు, బిల్డింగ్ ప్లాన్, అగ్నిమాపక భద్రత, గడిచిన ఐదేళ్లలో సాధించిన ఉత్తీర్ణత శాతం, కోర్సుల వివరాల సమాచారం కూడా అందజేయాలని పేర్కొన్నారు.

డీఎస్పీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా కార్యవర్గాన్ని ఆ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అగ్గిమల్ల గణేశ్, ఉపాధ్యక్షులుగా సీటీ వెంకటేశ్, సుష్మా, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల శ్రీనివాస్, కోశాధికారిగా మంజూషా, కార్యదర్శిగా గంగన్న, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ముదాం పవన్, కార్యవర్గ సభ్యులుగా గణేశ్, రాజేశ్వర్, నవీన్, శ్రీకాంత్, శేఖర్, అరవింద్, నరేశ్, గంగన్న, రాజన్న, సంతోష్, అనిల్, రవి, తిరుపతి, ప్రతాప్ ఎన్నికయ్యారు.

అమరం.. స్వేచ్ఛా స్మరణం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

- నేడు ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- తొలిసారిగా అధికారికంగా నిర్వహణ
- ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధుల రాక



ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం

1981 ఏప్రిల్ 20 జల్..జంగల్...జమీన్ కోసం ఉద్యమించిన అడవిబిడ్డలపై అప్పటి సర్కారు తుపాకీ ఎక్కుపెట్టింది. తూటాల వర్షం కురిపించింది. హక్కుల సాధనలో 15 మంది గిరిజనులు అమరులయ్యారు. వారి రక్తపుటేరులతో తడిసిన వనసీమ ఎర్రబారింది. అడవిబిడ్డల అమరత్వం నింగికెగిసింది. అగ్ని శిఖలా ఇంద్రవెల్లిలో అమరుల స్తూపమై నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి ప్రభుత్వాల పాలనలో స్వేచ్ఛగా నివాళులర్పించలేని దుస్థితి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం కొంతమేర సడలింపు ఇచ్చింది. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం ఏర్పాటుకు నిర్ణయించింది. అలాగే సంస్మరణ దినోత్సవాన్ని ఈ ఏడాది అధికారికంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది.

సాక్షి, ఆదిలాబాద్/ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మురిసిపోతుంది. నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి సిద్ధమైంది. ఏటా మాదిరిగానే కాకుండా ఈ సారి ఓ ప్రత్యేకత ఉంది. 43 ఏళ్లుగా నిర్బంధాలు, ఆంక్షల మధ్య అమరవీరులకు నివాళులు అర్పించగా, ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా సంస్మరణ వేడుకలను నిర్వహిస్తోంది. కొద్దిరోజులుగా జిల్లా అధికారులే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఫలితంగా ఈ సారి స్వేచ్ఛగా నివాళులు అర్పించవచ్చన్న మురిపెం ఆదివాసీల్లో కనిపిస్తోంది.

స్మృతివనంలో కళకళలాడుతున్న స్తూపం ..

ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం.. ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వెళ్లే మార్గ మధ్యలో ఇంద్రవెల్లి గ్రామ శివారులో నిలువెత్తుగా దర్శనమిస్తోంది. అయితే ఇన్నాళ్లుగా ఆ స్తూపం ఆవరణలో అభివృద్ధి మచ్చుకు కనిపించేది కాదు. ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి ప్రాంతం, ఆదివాసీల అభ్యున్నతిపై దృష్టి సారించారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన తొలుత ఇక్కడికే విచ్చేశారు. ఆ సమయంలోనే స్తూపం వద్ద అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.కోటి కేటాయించారు. ఆ నిధులతో అక్కడ ఎకరం స్థలంలో అమరవీరుల స్మృతివనం అభివృద్ధి చేశారు. అందులో భాగంగా చుట్టూ ప్రహరీ నిర్మించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కూడా పూర్తి చేశారు. ఈ సారి సంస్మరణ దినోత్సవంను అధికారికంగా ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా కొద్ది రోజులుగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం నిర్వహించనున్న కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఉమ్మడి జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

భూమి, భుక్తి, విముక్తి కోసం...

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న జరిగిన సంఘటనకు నేటితో 44 ఏళ్లవుతుంది. భూమి, భుక్తి, విముక్తితో పాటు స్వయం పరిపాలన కోసం ఆదివాసీలు పోరాటం చేశారు. అటవీ అధికారులు, షావుకార్ల దౌర్జన్యం నశించాలనే డిమాండ్‌తో గిరిజన రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నాడు ఇంద్రవెల్లిలో సభ ఏర్పాటు చేశారు. దీనికి పీపుల్స్‌వార్ మద్దతునిచ్చింది. అప్పట్లో ప్రభుత్వం సభ నిర్వహణకు అనుమతినిచ్చినట్టే ఇచ్చి ఆ తర్వాత రద్దు చేసింది. విషయం తెలియక ఆదివాసీగూడేల నుంచి పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. అయితే సభాస్థలాన్ని ఖాళీ చేయాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆదివాసీలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఇలా ఘర్షణ వాతావరణంలో పోలీసులు కాల్పులు జరపడంతో పలువురు ఉద్యమకారులు (15 మంది అధికారికంగా) మృతి చెందారు. కాల్పుల ఘటనలో అమరులైన ఆదివాసీల స్మారకార్థం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి వద్ద 80 అడుగుల స్తూపం నిర్మించారు. ఆ తర్వాత ప్రభుత్వాలు స్తూపం వద్ద సంస్మరణ దినోత్సవం నిర్వహణపై నిషేధాజ్ఞలు విధించాయి. దీంతో ఏళ్ల పాటు ఏప్రిల్ 20 వచ్చిందంటే అక్కడ భారీ ఎత్తున పోలీసుల బందోబస్తు కనిపించేది. స్తూపాన్ని 1986 మార్చిలో గుర్తు తెలియని వ్యక్తులు డైనమెట్లతో పేల్చారు. గిరిజనులు ఆందోళనతో 1987లో ప్రభుత్వం ఐటీడీఏ నిధులతో రెండోసారి నిర్మించింది. 2015 నుంచి తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వకపోయినా ఆంక్షలు సడలించింది. అయితే పోలీసు బందోబస్తు మాత్రం అదే రీతిలో ఉండేది. ఈ ఏడాది మాత్రం అలాంటివేమి లేకుండా ఆదివాసీలు స్వేచ్ఛగా నివాళులు అర్పించేందుకు సిద్ధమయ్యారు.

నేడు అధికారికంగా నివాళులు

నేడు ఉదయం 11 గంటలకు అధికారికంగా నిర్వహించనున్న సంస్మరణ సభకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు తరలివచ్చి నివాళులర్పించనున్నారు. మంత్రి చేతుల మీదుగా అమరుల కుటుంబీకులకు ట్రైకార్ ద్వారా రూ.10 లక్షల చొప్పున రుణ సౌకర్యం కల్పించనున్నారు. కాగా, నాటి ఘటనలో గాయపడిన వారిని కూడా ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చివరి దశకు స్మృతి వనం పనులు

నాటి అమరుల కుటుంబీకులతో పాటు గాయాలైన వారిని ఏ ప్రభుత్వం కూడా ఆదుకోలేదు. నాలుగేళ్ల క్రితం అప్పటి ఎంపీ సోయం బాపూరావ్ అమరుల కుటుంబీకులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెంచారు. స్తూపం వద్ద స్మృతి వనం ఏర్పాటుకు రూ.97లక్షల నిధులు కేటాయించారు. చుట్టూ ప్రహరీతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం, స్తూపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డుల ప్రకారం 15 మంది అమరవీరుల కుటుంబీకులకు మండలంలోని ముత్నూర్ సమీపంలో గతేడాది ఇళ్ల స్థలాలు కేటాయించి హక్కు పత్రాలు అందించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇటీవల ఆ పనులను ప్రారంభించారు.

“ ఆ ఘటనలో నా భర్త చనిపోయిండు..



ఇంద్రవెల్లి ఘటనలో నా భర్త కొద్దు చనిపోయిండు. ఆ తరువాత నేను కూలినాలి చేసి నా కొడుకును పెంచి పెద్ద చేసిన. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నా భర్త మరణాన్ని గుర్తించిండ్రు. ఇంటి స్థలం ఇచ్చిండ్రు. ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేసిండ్రు. ఐటీడీఏ ద్వారా రుణం ఇస్తే నా కొడుకుకు ఉపాధి దొరుకుతది.

– సెడ్మాకి లచ్చుబాయి, తాటిగూడ

“ నా కుటుంబాన్ని కూడా ఆదుకోవాలి



నాడు ఇంద్రవెల్లిలో సంతకు నా భర్త శంభుతో కలిసి వెళ్లిన. అక్కడి నుంచే ఇద్దరం మీటింగ్‌కు వెళ్లినం. ఆ సందర్భంగా పోలీసుల కాల్పుల్లో నా కుడి చేయికి గాయమైంది. నా భర్తకు కూడా తుపాకీ బుల్లెట్ల గాయంతో ఇంటికొచ్చి కొద్ది రోజుల తరువాత చనిపోయిండు. చేతికి గాయం కారణంగా ఇప్పటికీ నేను ఏ పని చేయలేకపోతున్న. ఉన్న ఒక్క కొడుకు కూడా అనారోగ్యంతో చనిపోయిండు. కోడలు వద్ద ఉంటూ కాలం వెల్లదీస్తున్న. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ కూడా రావట్లేదు. చాలా కష్టంగా ఉంది. ప్రభుత్వం గుర్తించి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నా కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్న.

– మడావి జంగుబాయి, కన్నాపూర్ గ్రామస్తురాలు

వడదెబ్బ.. అప్రమత్తతే అండ

- ఈ ఏడాది మండుతున్న ఎండలు
- ప్రభుత్వం ముందస్తు చర్యలు
- అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు
- వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- రిమ్స్‌లో ప్రత్యేక విభాగం

కైలాస్‌నగర్: ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వడగాలులు, వడదెబ్బను ప్రత్యేక విపత్తుగా పరిగణించింది. వాటి కారణంగా మృతి చెందే వారి కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచింది. అయితే ప్రజలు వాటి బారిన పడకుండా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎండల తీవ్రత పెరుగుతున్న క్రమంలో చల్లని తాగునీరు అందుబాటులో ఉంచేలా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఏఎన్‌ఎంలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ప్రజలు కూడా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

యంత్రాంగం సంసిద్ధం..

ప్రభుత్వం వడదెబ్బను విపత్తుగా ప్రకటించడంతో దాన్ని అధిగమించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మెడికల్ ఆఫీసర్లతో ఇటీవల సమీక్ష నిర్వహించారు. దీంతో జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వడదెబ్బతో వచ్చే బాధితులకు తక్షణ వైద్య సాయమందించేలా ఐదు పడకలతో రిమ్స్‌లో ప్రత్యేక విభాగాన్ని సిద్ధం చేస్తున్నారు. మంగళవారం నాటికి ఇది అందుబాటులోకి రానుందని రిమ్స్ వైద్యాధికారులు చెబుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్లకు, పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎండల తీవ్రతతో కలిగే అనర్థాలు, వడదెబ్బ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సత్వర వైద్యసేవలు అందించేలా సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. పీహెచ్‌సీలతో పాటు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు.



రిమ్స్‌లో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక విభాగం

వీరిపైనే అధిక ప్రభావం ..

జిల్లాలో గతంలో ఎన్నడులేని విధంగా ఈ ఏడాది మే నెలకు ముందే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్‌లోనే ఎండలు భగ్గుమంటున్నాయి. దీంతో జనం అల్లాడిపోతున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు, రైతులు, కార్మికులు ప్రత్యేకించి భవన నిర్మాణ రంగంలో పనిచేసే వారిపై భానుడి ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముంది. ఈ మేరకు వారంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. వీలైనంత వరకు ఎండలో వెళ్లకపోవడమే మంచిదని పేర్కొంటున్నారు. అత్యవసరమై బయటకు వెళితే గొడుగు, టోపీ, రుమాలు వంటివి ధరించాలని, సాధ్యమైనంత ఎక్కువ నీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఎక్స్‌గ్రేషియా రూ.4లక్షలకు పెంపు..

వడదెబ్బతో మృతి చెందే బాధిత కుటుంబాలకు గతంలో ఆపద్బాంధు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.50వేల సాయం అందించేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పరిహారాన్ని రూ.4 లక్షలకు పెంచింది. అయితే 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సందర్భాల్లోనే వడదెబ్బ మరణాలుగా పరిగణించనున్నారు. వడదెబ్బ, వేడిగాలులతో మరణం సంభవిస్తే సంబంధిత మెడికల్ ఆఫీసర్, తహసీల్దార్, పోలీస్ అధికారి(ఎస్సై ర్యాంకుకు తగ్గకుండా ఉండే)తో కూడిన బృందం క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది. వడదెబ్బ మరణమే అని వారు నిర్ధారిస్తే మృతుడి కుటుంబీకుల్లో ఎవరికి ఆర్థికసాయం అందించాలో వివరాలు సేకరిస్తారు. అనంతరం వివరాలతో పాటు మృతుడి డెత్ సర్టిఫికెట్‌ను సంబంధిత అధికారులకు నామినీ సమర్పించాల్సి ఉంటుంది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, కలెక్టర్ ధ్రువీకరించిన తర్వాత బాధిత కుటుంబానికి పరిహారం మంజూరు చేస్తారు. అయితే మృతులు రైతుబీమాలో నమోదై ఉండి వడదెబ్బతో మరణిస్తే ఏ పథకం కింద ఎక్కువ ఆర్థికసాయం అందుతుందో దానినే అమలు చేయనున్నట్లుగా ప్రభుత్వం స్పష్టం చేసింది.

అప్రమత్తతే శ్రేయస్కరం

వడగాలులు, వడదెబ్బ విపత్తను ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణనిచ్చాం. క్షేత్రస్థాయిలోనూ ఎండ నుంచి రక్షణ పొందేలా ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాకు ఇటీవలే రెండు లక్షల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వచ్చాయి. వాటిని పీహెచ్‌సీలతో పాటు ఆశ, ఆరోగ్య కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచుతున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించినట్లెతై దీని బారిన పడకుండా ఉండవచ్చు.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

అభివృద్ధి పనుల్లో అలసత్వం ఉపేక్షించం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు

- నిర్లక్ష్యానికి తావులేదు
- అలాంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- త్వరలో అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీ
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలపై సమీక్ష
- అభివృద్ధి పనుల తీరుపై ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల అసంతృప్తి

నిర్మల్‌చైన్‌గేట్: ‘అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యానికి తావు లేదు.. అలసత్వం వహించే వారిని ఉపేక్షించేది లేదు.. పని చేయకుంటే వారిని పక్కన పెట్టుడే.. అలాగే గడువులోపు నాణ్యతతో పూర్తి చేయించాలి..’ అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణనీటి సరఫరా, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి పనులపై శనివారం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెండర్ దశ నుంచే పనులు వేగవంతం చేసి, వర్షాకాలానికి ముందు పూర్తిచేయాలన్నారు. ఆలస్యం చేస్తున్న గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి, త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. పనుల నాణ్యతపై రాజీలేకుండా చూడాలని, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. సాగు, తాగునీటి సమస్యల పరి ష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు స్ప ష్టం చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులకు వాస్తవాలు చెప్పాలని ఫీల్డ్ విజిట్‌చేసి ఎప్పటికప్పుడు ఏఈలు భగీరథ పనులు సమీక్షించుకోవాలన్నారు.

అంగన్‌వాడీల బలోపేతం, సౌకర్యాల విస్తరణ

త్వరలో అంగన్‌వాడీల్లో టీచర్లు, ఆయాల ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి తెలిపారు. సొంత భవనాలు లేని కేంద్రాలకు రూ.12 లక్షలతో పక్కా భవనాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. గతంలో మండలానికి ఒక భవనం నిర్మిస్తే, ఇప్పుడు రెండు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మూడేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలకు సొంత భవనాలు, విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మినీ అంగన్‌వాడీలను అప్ గ్రేడ్ చేస్తామని, సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్లు, ట్రాన్స్ జెండర్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

మహిళా సంఘాలకు చెక్కులు..

మంత్రి సీతక్క, కలెక్టరేట్‌కు చేరుకోగానే పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. మహిళా పోలీసులు ఏర్పాటు చేసిన ‘శివంగి’ బృందాన్ని లాంఛనంగా ప్రారంభించి, రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. తర్వాత మహిళా సంఘాలకు, మెప్మాలకు మంజూరైన చెక్కులను కలెక్టర్ అభిలాష అభినవ్, ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేశారు. బ్యాంకు లింకేజీ, రుణాల మంజూరు, వసూలులో నిర్మల్ జిల్లా ప్రగతిని మంత్రి ప్రశంసించారు. సమావేశంలో ఎంపీ గోడం నగేశ్, నిర్మల్, ఆదిలాబాద్, ముధోల్, ఖానాపూర్, సిర్పూర్, ఆసిఫాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఐసీడీఎస్ సెక్రటరీ అనితా రామచంద్రన్, మంచిర్యాల, నిర్మల్ కలెక్టర్లు కుమార్ దీపక్,అభిలాష అభినవ్, ఐటీడీఏ పీవోఖుష్బూ గుప్తా, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు స్థానికులకే ఇవ్వాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల టెండర్లు రాష్ట్రస్థాయిలో కాకుండా స్థానికులకే ఇవ్వాలి. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే రోడ్డు పనులు ఏడు నెలలు గడిచినా టెండర్లు పూర్తి చేయలేదు. ఈజీఎస్ నిధులతో రైతులకు ఉపయోగపడే విధంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

– పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

అభివృద్ధికి అటవీశాఖ అడ్డంకి..

గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతా మంటే టైగర్ జోన్ పేరిట ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టైగర్ జోన యినా ఎత్తివేయాలి లేక అభివృద్ధి పనులకు అనుమతులయినా ఇవ్వాలి. బోథ్ నియోజకవర్గంలో అధికారులు 94 క్రిటికల్ గ్రామాలున్నాయని నివేదిక సమర్పించినా వాస్తవంగా దాదాపు 200 వరకున్నాయి. ఈ గ్రామాలకు నేటికీ తాగునీటి సరఫరా జరగడం లేదు.

– అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- మంత్రి సీతక్క

ఆదిలాబాద్: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణఅభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని స్టేడియంలో దివ్యాంగులకు శనివారం సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు స్వశక్తితో ఎదిగేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. అలింకో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలను పంపిణీ చేసినట్లు వివరించారు. ఇందులో ఎంపీ నగేశ్, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, డైరెక్టర్ శైలజ, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మిల్కా తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ నిర్వహించారు. మంత్రి సీతక్క హాజరై దివ్యాంగులకు వాటిని అందజేశారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ, దివ్యాంగుల సహాయ ఉపకరణాల కోసం కేంద్రం నిధులిస్తున్నా పంపిణీ కార్యక్రమంలో ప్రధాన మంత్రి ఫొటో లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ, దివ్యాంగులకు బ్యాటరీతో కూడిన స్కూటీలు ఇవ్వాలని మంత్రిని కోరారు.



ఇచ్చోడలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందజేస్తున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ నగేశ్

మంత్రి రాకతో మార్కెట్ బంద్ చేయించిన పోలీసులు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో ఇచ్చోడలో పోలీసులు మార్కెట్ బంద్ చేయించడం చర్చనీయాంశంగా మారింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సీతక్క హజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు శనివారం ఉదయం 8 గంటల నుంచే మార్కెట్‌ను మూసి వేయించారు. విషయం తెలియక వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అయోమయానికి గురయ్యారు. దీనిపై సొంత పార్టీ నాయకులు సైతం చర్చించుకోవడం కనిపించింది. ప్రతిపక్ష పార్టీల నాయకులు బంద్ వ్యవహారంపై విస్మయం వ్యక్తం చేశారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం..

బోథ్: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ధన్నూర్ బి గ్రామం వద్ద వంతెన నిర్మిస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. రూ.3.30 కోట్లతో నిర్మించనున్న వంతెన పనులకు ఎమ్మెల్సీ విఠల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం పోషణ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, వంతెన నిర్మాణానికి వస్తున్న మంత్రి కాన్వాయ్‌ను కుచులాపూర్ గ్రామస్తులు ఆపారు. గమనించిన మంత్రి వాహనంలో నుంచి దిగి వారితో మాట్లాడారు. తమకు రుణమాఫీ కాలేదని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

జొన్నల కొనుగోళ్లు ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే శంకర్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణ, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో ఎస్సై ప్రశాంత్

వాంకిడి: అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం శనివారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ముజీమ్, ఎండి తాజ్ కాగజ్‌నగర్ ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బొలెరో వాహనంలో మహారాష్ట్రకు తరలిస్తుండగా వాంకిడి మండల కేంద్రంలోని లంజన్వీర ఎక్స్‌రోడ్ వద్ద పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి బియ్యం సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఐదు ఎద్దులు మృతి



మృతి చెందిన ఎద్దులు

ఇచ్చోడ(బోథ్): మండలంలోని కేశవపట్నంలో శనివారం విద్యుదాఘాతంతో ఐదు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన షేక్ అలీకి చెందిన రెండు ఎద్దులు, షేక్ ఇస్మాయిల్, షేక్ ఎక్బాల్, షేక్ ఖమర్‌కు చెందిన ఒక్కో ఎద్దు మేతకు వెళ్లాయి. కేశవపట్నం నుంచి గాయిద్‌పెల్లి వెళ్లే విద్యుత్ తీగలు కింద పడిపోవడంతో గమనించని ఎద్దులు వాటిని తాకడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఆర్ఐ హుస్సేన్ సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు.

నేడు బీసీ గురుకులాల ప్రవేశ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈనెల 20న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో సేరు శ్రీధర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 12 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షకు 3,308 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో రెండు, నిర్మల్ జిల్లాలో నాలుగు, కుమురంభీం జిల్లాలో మూడు, మంచిర్యాల జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షకు గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 17న లైన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, ఏఈ సంతోష్ విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. నేషనల్ హైవే ఎక్స్‌టెన్షన్‌లో భాగంగా ఆడ గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. దీంతో గ్రామానికి చెందిన పాయల్ శరత్, పాయల్ సాయి, రాకేష్, సుభాష్, రాజు, గణేశ్‌తో పాటు మరికొంత మంది గ్రామస్తులు జైనథ్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధుల్లో ఉన్న లైన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డిని కొట్టడంతో పాటు ఏఈ సంతోష్‌ను నెట్టివేసి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జేఈఈలో మెరిసిన మనోళ్లు

దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం రాత్రి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జేఈఈ మెయిన్ ఫలితాలను ప్రకటించింది.

షేక్ అమన్‌కు 11,040 ర్యాంకు



షేక్ అమన్

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు షేక్ హుస్సేన్, మైమూద దంపతుల కుమారుడు షేక్ అమన్ జేఈఈ మెయిన్‌లో 97.46 పర్సంటైల్ తో ఆలిండియాలో 11,040 ర్యాంకు సాధించాడు. సదరు విద్యార్థిని గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల సూచనల వల్లే మంచి మార్కులు సాధించానని షేక్ అమన్ పేర్కొంటున్నాడు.

2,908 ర్యాంక్ సాధించిన రాధిక



ఆడే రాధిక

తాంసి: ఆదిలాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన ఆడే నరేందర్, దర్శన దంపతుల కుమార్తె రాధిక 84.63 పర్సంటైల్‌తో ఎస్టీ కోటాలో ఆలిండియా 2,908 ర్యాంక్ సాధించింది. ప్రత్యేక శిక్షణతో పాటు కళాశాల అధ్యాపకులు అందించిన ప్రోత్సాహంతో పరీక్షకు సన్నద్ధమై విజయం సాధించినట్లు రాధిక పేర్కొంది. రాధికను కళాశాల యాజమాన్యంతో పాటు తల్లితండ్రులు, బంధువులు అభినందించారు.

బెల్లంపల్లి సీవోఈ విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించారు. కళాశాల నుండి మొత్తం 39 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 15 మంది జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు.

ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వీరే...

ఎస్.కే. సుభాన్ 88.88 పర్సంటైల్ సాధించి కళాశాల టాపర్‌గా నిలవగా కె.రంజిత్ 86.57, సీహెచ్.సాయికుమార్ 85.15, కె.శ్రీనివాస్ 80.17, ఎం.సాయిరాం 78.99, ఆర్.అంజి 78.53, కె.శారూన్ 76.84, డి.రాజేందర్ 75.69, ఎస్.ఆదర్శ్ 75.04, ఎన్.రాజేశ్, 75.35, ఎస్.వెంకటేశ్వర్ 72.66, బి.ప్రవీణ్‌కుమార్ 73.67, బి.అంజిబాబు 72.30, జీ.చరణ్ 63.87, కె.రామ్ చరణ్‌తేజ 62.39 పర్సంటైల్ సాధించారు. సదరు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆకిడి విజయ్‌సాగర్, వైస్ ప్రిన్సిపాల్ దుర్గం రమాదేవి, లెక్చరర్లు అభినందించారు.


షేక్ సుభాన్


కె.రంజిత్


సాయికుమార్


కె.శ్రీనివాస్


ఎం.సాయిరాం

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు



బెల్లంపల్లి సీవోఈ కళాశాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఏటా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ సారి కూడా జేఈఈ మెయిన్స్‌లో 15 మంది విద్యార్థులు మెరుగైన పర్సంటైల్ సాధించారు. సమష్టి కృషితోనే విజయం సాధ్యమైంది. నిరుపేద విద్యార్థులైనా చదువులో తామేమీ తక్కువ కాదని నిరూపించారు.

– ఆకిడి విజయ్‌సాగర్, సీవోఈ ప్రిన్సిపాల్, బెల్లంపల్లి

జనరల్ కేటగిరీలో 274 ర్యాంకు



రుత్విక్‌రెడ్డి

కౌటాల: మండలంలోని తలోడి గ్రామానికి చెందిన షాడ తిరుపతిరెడ్డి–జ్యోతి దంపతుల కుమారుడు రుత్విక్‌రెడ్డి జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఆలిండియా జనరల్ కేటగిరీలో 274 ర్యాంక్ సాధించాడు. పదో తరగతి వరకు కౌటాలలో చదివిన రిత్విక్‌రెడ్డి ఇంటర్ హైదరాబాద్‌లో చదువుతున్నాడు. సదరు విద్యార్థిని శనివారం కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఆదిలాబాద్‌రూరల్: దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో మావల మండలంలోని ఎస్ఆర్ ప్రైమ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. రాథోడ్ సచిన్ 3,333 ర్యాంకు, బి.శివసాయి 4,721, వాసు 6,876, ఎల్.శ్రీలేఖ 7,505, అక్షాద్ 8,071, జాదవ్ సాయిరామ్ 9,067, రాథోడ్ సంధ్య 9,156, రాథోడ్ పావని 11,113, రాథోడ్ హరీష్ 13,731 ర్యాంకుతో పాటు మరో 32 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాల చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు సదరు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు జయపాల్‌రెడ్డి, అరవింద్, లలిత పాల్గొన్నారు.

సత్తా చాటిన యోగిదాస్



జాదవ్ యోగిదాస్

బజార్‌హత్నూర్: మండలంలోని కాండ్లీ గ్రామానికి చెందిన జాదవ్ సంగీత, రవీందర్ దంపతుల కుమారుడు జాదవ్ యోగిదాస్ నాయక్ శనివారం ప్రకటించిన జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఆలిండియా ఎస్టీ కోటాలో 1,833 ర్యాంక్ సాధించాడు. సదరు విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

నిర్మల్ విద్యార్థుల ప్రతిభ


సృజన్ కుమార్


రుతిక్ కుమార్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని విజయనగర్ కాలనీకి చెందిన ఉపాధ్యాయులు పోతుల్‌వార్ సురేష్–స్వప్న దంపతుల కుమారుడు సృజన్ కుమార్ జేఈఈ మెయిన్‌లో 99.96 శాతం పర్సంటైల్‌తో ఆలిండియాలో 683 కామన్ ర్యాంక్, ఓబీసీ విభాగంలో 105 ర్యాంక్ సాధించాడు. జిల్లా కేంద్రానికి చెందిన అటోలి సంజీవ్ కుమార్, చింతప్రభ దంపతుల కుమారుడైన రుతిక్ కుమార్ 99.89 శాతం పర్సంటైల్ సాధించి ఓబీసీ కోటాలో 301 ర్యాంకును కైవసం చేసుకున్నాడు. స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నహీద్ పాష కుమారుడు సయ్యద్ రియాజ్ 99.88 శాతం పర్సంటైల్ సాధించాడు.

'గిరిజన' విద్యార్థుల సత్తా


రాథోడ్ సతీశ్


సుధీర్‌కుమార్

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలంలోని అంజనీ తండాకు చెందిన రాథోడ్ విజయ–సంతోష్ దంపతుల కుమారుడు రాథోడ్ సతీశ్, చవాన్ సేపాబాయి–అంబాజీ దంపతుల కుమారుడు చవాన్ సుధీర్ కుమార్ జేఈఈ మెయిన్ ఫలితాల్లో సత్తా చాటారు. రాథోడ్ సతీశ్ 89.018 పర్సంటైల్‌తో ఎస్టీ కేటగిరీలో ఆలిండియా 1,744 ర్యాంకు సాధించాడు. చవాన్ సుధీర్ కుమార్ 81.105 పర్సంటైల్‌తో ఆలిండియాలో ఎస్టీ కేటగిరీలో 4,086 ర్యాంకు సాధించాడు. ప్రతిభ కనబర్చిన సదరు విద్యార్థులను గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో ట్రినిటీ సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఎ.రఘుపతి జాతీయస్థాయిలో 138వ ర్యాంకు, ఎ.హేమంత్ 162, డి.సాయిచరణ్‌కుమార్ 313, ఎస్.పరమేశ్వరరెడ్డి 344, ఎ.ఫణీందర్ 409, ఆర్.సాయికిశోర్ 587, వి.అదీప్ 751, డి.మహేశ్ 974, ఆర్.మనోజ్ 1,262, బి.సిద్ధిక 1,551 ర్యాంకు సాధించారు. కేవలం కరీంనగర్ బ్రాంచ్ నుంచి 1,000 లోపు 8 ర్యాంకులతో పాటు పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 83 శాతం మంది ఉత్తమ ర్యాంకులతో జేఈఈ–అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడారు. నిర్దిష్ట ప్రణాళిక, ఉన్నతమైన బోధన, నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. రాబోయే అడ్వాన్స్ పరీక్షల్లో మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించి పేరొందిన ఐఐటీ సంస్థల్లో తమ విద్యార్థులు సీట్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల విజయకేతనం



ర్యాంకులు చూపుతున్న శ్రీచైతన్య విద్యార్థులు

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు. ఎం.రోహిత్ 17, టి.కుందన్ 814, పి.ఈశ్వర్ ముఖేశ్ 1,275, ఎం.అంజలి 2,575, బి.అక్షర 2,992, ఎం.తరుణ్ 5,949, నందిని7,464 ర్యాంకు, 20 వేల లోపు 15 మంది ర్యాంకులు సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 40 శాతం మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, సంస్థ స్థాపించిన నాటి నుంచి అన్ని పోటీ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు రాణిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో గిన్నిస్ రికార్డు

- 54 మందికి అందిన గిన్నిస్ వరల్డ్ రికార్డు పత్రాలు



మెడల్స్‌తో బాల నృత్యకారులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన 54 మంది చిన్నారులు కూచిపూడి నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. స్వరూపిణి నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో శిక్షకురాలు నవ్య వినయ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన చిన్నారులు 2023 డిసెంబర్ 24న జీఎంసీ బాలయోగి స్టేడియంలో భారత్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచారు. పరిశీలకుల బృందం ఎంపిక చేసిన మీదట 18 నెలల అనంతరం ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ పంపించినట్లు శిక్షకురాలు నవ్య తెలిపారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్పీ ఉపేందర్ రెడ్డి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ముత్యంరెడ్డి చిన్నారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు అల్లాడి సురేష్, మహిళా హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ అనిషా, చెనిగారపు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సినీఫక్కీలో గొలుసు అపహరణ

సారంగాపూర్: నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారిపై ధని గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని జామ్ గ్రామానికి చెందిన వాసాల రమేశ్ తన ఆటోలో ప్రయాణికులతో నిర్మల్ నుంచి జామ్ వైపు బయలుదేరాడు. వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై ఆటోను అనుసరిస్తూ వచ్చిన ఇద్దరు దుండగులు ధని గ్రామ సమీపంలోని మూలమలుపు వద్దకు చేరుకోగానే ఆటో స్పీడ్ బ్రేకర్ వద్ద వేగం తగ్గించడంతో వెనుక వైపు కూర్చున్న గోవింద్‌గారి సంగీత, గ్యానెడి గంగామణి మెడల్లోంచి బంగారు గొలుసులను లాగారు. ఈక్రమంలో గ్యానెడి గంగామణి మెడలోంచి లాగిన 26 గ్రాముల బంగారు గొలుసు దొంగల చేతిలో పడగా సంగీత మెడలోంచి లాగిన గొలుసు తెగి ఆమెపైనే పడిపోయింది. అయితే ఇద్దరు మహిళలు తమ బంగారు గొలుసులు అపహరించారని గుర్తించిన మహిళలు కేకలు వేయడంతో ఆటోను ఆపి జరిగిన విషయం తెలుసుకున్న తోటి ప్రయాణికులు విస్తుపోయారు.

అసలు బంగారం పోయింది.. నకిలీ మిగిలింది

గ్యానెడి గంగామణి మెడలో ఉన్నది అసలు బంగారం. కాగా గోవింద్‌గారి సంగీత మెడలో ఉన్నది మాత్రం నకిలీ గొలుసు. దొంగలు గొలుసులను లాగే ప్రయత్నంలో సంగీత మెడలో ఉన్న నకిలీ బంగారు గొలుసు ఆమె ముందే ఆటోలో పడిపోగా అసలైన బంగారం ధరించిన గంగామణి మెడలోంచి లాగిన బంగారు గొలుసు దొంగల చేతిలో పడింది. దీంతో సదరు మహిళ బోరున విలపించింది. అప్రమత్తమైన ఆటో డ్రైవర్ ప్రయాణికులతో పాటు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- ఇద్దరికి తీవ్రగాయాలు


గాయాలపాలైన హన్మంతు


చికిత్స పొందుతున్న బాబన్న

తానూరు/భైంసాటౌన్: తానూరు మండలంలోని భోసి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాంద గ్రామానికి చెందిన చందు (50), హన్మంతు, బాబన్న(సుదర్శన్) భైంసా వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా భోసి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. చందు తలపై నుంచి వాహనం వెళ్లడంతో తలభాగం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. హన్మంతు, బాబన్నకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. హన్మంతు పరిస్థితి విషమంగా ఉండడంతో నాందేడ్‌కు తరలించగా, బాబన్న భైంసా ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఈతకు వెళ్లి విద్యార్థి గల్లంతు

లక్ష్మణచాంద: ఈతకు వెళ్లి విద్యార్థి గల్లంతైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు వడ్యాల్ గ్రామానికి చెందిన మద్దెల గంగన్న–లక్ష్మి దంపతుల కుమారుడు రామ్‌చరణ్ (14) శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఒంటిగంట సమయంలో కాలనీ పిల్లలతో కలిసి గ్రామ సమీపంలోని చెక్ డ్యాంకు స్నానానికి వెళ్లారు. సాయంత్రమైనా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఆరా తీయగా ఈతకు వెళ్లినట్లు తెలిసింది. దీంతో చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లి చూడగా రామ్‌చరణ్ బట్టలు, పాదరక్షలు కనిపించాయి. చీకటి కావడంతో తిరిగి ఇంటికి వచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు.

కన్యాకుమారి నుంచి కశ్మీర్‌కు సైకిల్‌యాత్ర



కొట్రెస్‌కు సూచనలు చేస్తున్న పోలీసులు

నేరడిగొండ: బెంగళూరుకు చెందిన కొట్రెస్ సోలార్ ద్వారా నడిచే సైకిల్‌పై కన్యాకుమారి నుంచి కశ్మీర్‌కు యాత్ర చేపట్టాడు. శనివారం నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజ్ వద్ద అతను హైవే పెట్రోలింగ్ పోలీసులకు కనిపించగా పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని, వెంట ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలని సూచించారు.

ప్రజా ప్రభుత్వంలో పర్యాటక క్షేత్రాల అభివృద్ధి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నేరడిగొండ: ప్రజా ప్రభుత్వంలో పర్యాటక క్షేత్రాలను అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఎమ్మెల్సీ దండే విఠల్, పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డితో కలిసి కుంటాల జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జలపాతం అభివృద్ధికి కృషి చేస్తానని, త్వరలోనే రోప్‌వే నిర్మిస్తామన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం రిసార్ట్ పనులను ప్రారంభించామని, జూన్ నాటికి రిసార్టు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణం దెబ్బతినకుండా కుంటాల జలపాతాన్ని అభివృద్ధి చేసి స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించేలా చూస్తామన్నారు. నిజాం కాలంలోనే కుంటాల జలపాతం వద్ద అప్పటి అధికారులు ఇక్కడ సేద తీరినట్లు ఆనవాళ్లు ఉన్నాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుంటాల జలపాతానికి, పర్యాటక రంగానికి చేసిందేమి లేదన్నారు. మంత్రి వెంట కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, నాయకులు తుల అరుణ్ కుమార్, ఆత్రం సుగుణ, తలమడుగు మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, తిత్రే నారాయణసింగ్, జాదవ్ కపిల్, ఆడే సతీశ్, బద్దం పోతారెడ్డి, నాయిడి రవి, తదితరులు ఉన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు వాయిదా

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ ఒకేషనల్, బీసీఏ తదితర కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలు, మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల పరీక్షలు (బ్యాక్‌లాగ్) ఈ నెల 21 నుంచి జరగాల్సి ఉండగా వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ శనివారం తెలిపారు. ఎక్కువశాతం ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు విద్యార్థుల పరీక్షల ఫీజులు యూనివర్సిటీకి చెల్లించలేదని, నామినల్ రోల్స్ కూడా పంపకపోవడంతో ఆయా పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని, నిర్వహణ రీషెడ్యూల్ కూడా విడుదల చేస్తామన్నారు.

21 నుంచి సమ్మెలోకి ఆర్జీయూకేటీ అధ్యాపకులు



సమ్మె నోటీస్ అందిస్తున్న సభ్యులు

బాసర: రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాతే నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఆర్జీయూకేటీ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం తెలిపారు. శనివారం సమ్మె నోటీస్‌ను ఏవో రణధీర్‌కు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ స్థాపించినప్పటి నుంచి దాదాపుగా 17 ఏళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎస్. విజయ్ కుమార్, మంద సతీశ్ కుమార్, శ్రీధర్, తిలక్‌రెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జిల్లా అధికారుల ఆదేశాలతో జైనథ్ మండలంలోని పెన్‌గంగా పరీవాహక గ్రామాలపై మండల స్థాయి అధికారులు అప్రమత్తమై ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే తమకు అందిన సమాచారం మేరకు శనివారం ఎస్సై పురుషోత్తం, తహసీల్దార్ నారాయణ, ఆర్ఐ ఉల్లాస్ సాంగ్వి, కొట గ్రామాల మధ్య ఉన్న ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సుమారు 10 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇసుక విలువ రూ.20వేల వరకు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

శోక సంద్రంలో సోన్



అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

సోన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో అష్టపు ప్రేమ్‌సాగర్ మృతదేహం శనివారం స్వగ్రామం చేరుకుంది. వారం రోజుల క్రితం దుబాయిలోని ఓ ప్రముఖ బేకరీలో పనిచేస్తున్న ప్రేమ్‌సాగర్‌ను పాకిస్తాన్‌కు చెందిన యువకుడు కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. అంతిమయాత్రలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణిరెడ్డి, బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, అయ్యన్న గారి భూమయ్య, ముత్యపలి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ పర్వదినం ప్రత్యేకం

దేవుని విమోచన కార్యక్రమంలో అత్యంత శకిమంతమైనది క్రీస్తు పునరుత్థాన శక్తే. మానవునికి మరణం తోనే జీవితం అంతం కాదని పునరుత్థానం తెలియజేసింది. ప్రతి మనిషి సదాకాలము దేవునితో కలిసి జీవించవచ్చన్న గొప్ప నిరీక్షణ కలిగింది. ఎందుకంటే యేసు అంటున్నాడు 'పునరుత్థానం జీవం నేనే. నా యందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రతుకును. బతికి నాయందు విశ్వాసముంచు వాడు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు'.

మరణమా నీ ముల్లెక్కడ?

శుక్రవారం సిలువ వేయబడిన యేసును తలచుకొని యూదా మతపెద్దలు యేసు ఇక శాశ్వతంగా మట్టిలో కలిసి పోయాడని సంబర పడ్డారు. వారిలో ఆ దుష్ట తలంపు పెట్టిన అపవాదియైన సాతాను దేవునిపై విజయం సాధించానని ఇక ఈ లోకం అంతా తన చెప్పు చేతల్లో ఉండిపోతుందని భ్రమ పడ్డాడు. అయినా ఎందుకైనా మంచిదని క్రీస్తును ప్రత్యేకంగా అరిమత్తయి ఏర్పాటు చేసిన సమాధి చుట్టూ ఎవరు తొలగించలేని పెద్ద రాతిని ఏర్పాటు చేశారు. బలమైన రోమా సైనికులను సమాధికి కాపలాగా పెట్టారు. క్రీస్తు మూడవ దినమున లేస్తానని చెప్పిన మాట నెరవేరకుండా శతవిధాలుగా తమ ప్రయత్నం వారు చేశారు. ఇక ఏసు చరిత్ర శాశ్వతంగా ఖననం చేశామని ఇక ఎప్పటికీ తామే మతపెద్దలుగా యూదా ప్రజలను తమ అధీనంలోనే వుంచుకోవచ్చని రోమా అధికారులకు లంచం కడుతూ తమ పబ్బం గడుపుకోవచ్చని కలలుగంటూ శనివారం అంతా హాయిగా నిద్రపోయారు. మరోపక్క యేసు చేసిన అద్భుత సూచక క్రియలు చూసి ఆయన పరలోక దివ్య వాక్కులు విన్న ప్రజలు యేసు సిలువ మరణాన్ని జీర్ణించు కోలేని స్థితిలో వుండిపోయారు. యూదా గలిలయా సమరియ ప్రాంతాల్లో క్రీస్తు ద్వారా స్వస్థత పొందిన గుడ్డి, కుంటి, మూగ, చెవిటి వారు, కుష్టు రోగులు మరణించి క్రీస్తుతో బతికింపబడినవారు, క్రీస్తును అభిమానించేవారు, వివిధ అద్భుతాలను చూసినవారు యేసు మరణంతో శోకసంద్రంలో మునిగిపోయారు. చివరకు యేసుతో మూడున్నర సంవత్సరాలు తిరిగిన ఆయన శిష్యులు యూదా మతపెద్దలకు భయపడి యెరూషలేము పట్టణంలో ఓ గదిలో దాక్కుండిపోయారు. అయినా దేవుని ప్రవచనాలు నెరవేరక తప్పవు కదా! భూమి పునాదులు వేయక ముందే ఆయన ఏర్పాటు చేసిన రక్షణ ప్రణాళిక అనాది సంకల్పం నెరవేరక తప్పదు కదా!

యేసు పునరుత్థాన శక్తి

యేసు తన శరీరంలో సిలువ ద్వారా పాపానికి శిక్ష విధించి బలి అర్పణగా శరీరాన్ని సమర్పించడం ద్వారా మరణంపై సాతాను కున్న అధికారాన్ని నాశనం చేశాడు. మనుషుల్లో మరణం పట్ల ఉన్న భయాన్ని పునరుత్థాన శక్తితో తీసివేయడం ద్వారా దేవునితో ధైర్యంగా విశ్వాసంతో ముందుకు కొనసాగడానికి బాటలు వేశాడు. ప్రథమ మానవుడైన ఆదామును సాతాను లోబరుచుకొని మరణానికి పాత్రుడుగా చేశాడు. ఫలితంగా పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పని పరిస్థితి నెలకొంది. అయితే కడపటి ఆదాముగా వచ్చిన యేసు పునరుత్థానం ద్వారా ఆ శాపం పూర్తిగా తొలగించబడింది. అంటే మనుష్యుని ద్వారా ఎలా మరణం వచ్చిందో మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానం కలిగింది. ఈ ప్రక్రియ ద్వారా క్రీస్తులా ప్రతి ఒక్కరూ పునరుత్థానం పొందే అవకాశం లభించింది.

తొలగింపబడిన రాయి

ఆదివారం ఉదయమే ఇంకా తెల్లవారకముందు యేసు ద్వారా స్వస్థత పొందిన మగ్దలేని మరియ, కొంతమంది ధైర్యవంతులైన స్త్రీలు సుగంధ ద్రవ్యాలను తీసుకొని యేసును సమాధి చేసిన చోటుకు చేరుకున్నారు. రోమా అధికారక ముద్రతో వేయబడ్డ ఆ పెద్ద రాయి ఎవరు తొలగిస్తారన్న ఆలోచన ఆ మహిళకు కలిగింది. తీరా సమాధి వద్దకు వచ్చి చూస్తే వారి జీవితంలో ఎన్నడు కలుగనంత విభ్రాంతికి లోనయ్యారు. అప్పటికే సమాధి మీద రాయి తొలగించబడింది. అంతకు క్రితమే యేసు సమాధిమీద ఉన్నరాయి పరలోకం నుండి ప్రభువుదూత దొర్లించినట్లు లేఖనాలలో రాయబడింది. ఆ ప్రాంతంలో భూకంపం వచ్చింది. అక్కడ కావలి వున్న రోమా సైనికులు భయపడి చచ్చినవారిలా పరుండిపోయారు. స్త్రీలు అక్కడికి వచ్చినప్పుడు రాయి దొర్లించబడి ఉండటం చూశారు. సమాధి లోపల యేసు దేహం వారికి కనిపించలేదు. అప్పుడు దూత ప్రత్యక్షమై "సజీవుడైన క్రీస్తును మృతులలో ఎందుకు వెదుకుచున్నారు? ఆయన ముందుగా చెప్పిన విధంగా లేచి యున్నాడు. ఈ శుభవర్తమానం శిష్యులకు తెలియజేయండి" అని చెప్పడంతో స్త్రీలు మహానందంతో వెనుకకు తిరిగారు.

పునరుత్థానుడైన క్రీస్తు

యేసు చెప్పిన విధంగానే చనిపోయిన మూడవరోజు మృత్యుంజయుడై లేచాడు. దానితో ప్రపంచ చరిత్రలో మరణాన్ని గెలిచి లేచిన చారిత్రాత్మిక పురుషుడిగా నిలిచి పోయాడు. ప్రపంచ చరిత్ర క్రీస్తుపూర్వం క్రీస్తు శకంగా చీలిపోయింది. పునరుత్థానుడైన యేసు ముందుగా తనను వెదకడానికి వచ్చిన స్త్రీలకు కన్పించి వారికి శుభమని చెప్పి ముందు మీరు వెళ్ళి నా శిష్యులకు గలిలయ వెళ్ళమని చెప్పి అక్కడ వారిని కలుస్తానని చెప్పాడు.

ఈలోగా సమాధికి కాపలాగా ఉన్న రోమా సైనికులు ప్రధాన యాజకుల వద్దకు పోయి యేసు మరణం నుండి లేచిన సంగతి వివరించారు. వారు రోమా సైనికులకు లంచం ఇచ్చి ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని చెబుతూ మేము రాత్రివేళ నిద్దుర పోతుంటే యేసు శిష్యులు వచ్చి యేసు శరీరాన్ని ఎత్తుకు వెళ్ళారని అబద్ధం చెప్పండి ఒకవేళ అధికారులు ఏమన్నా హడావుడి చేస్తే వారిని మేము చూసుకుంటామని నచ్చచెప్పి పంపించి వేశారు. అయితే యేసు చెప్పిన విధంగానే గలిలయ శిష్యులకు దర్శనం ఇచ్చాడు.

ఈ ఈస్టర్ పండుగ సమయంలో యేసు పునరుత్థాన శక్తి ప్రతి ఒక్కరం పొందుదం గాక! ఆమేన్!!

– మన్య జ్యోత్స్న రావు



నవోదయాన్నిచ్చిన ఆదివారం

మానవ చరిత్రలో ఆ ఆదివారం ఎన్నటికీ మరపురానిది. ఎందుకంటే యేసుక్రీస్తు అన్ని కుట్రలనూ, దుర్మార్గాలనూ, దౌర్జన్యాలనూ పటాపంచలు చేసి సమాధినీ, మరణాన్నీ గెలిచి సజీవుడు కావడం ద్వారా దీనులు, పాపులు, నిరాశ్రయులందరికీ నవోదయాన్నిచ్చిన దినం ఆ ఆదివారం...

యేసుక్రీస్తు మానవరూప ధారియైన రక్షకుడుగా ఈ లోకానికి తన పరమ తండ్రి ఆదేశాలు, సంకల్పాలను అమలుపర్చడానికి విచ్చేసిన దైవకుమారుడు, అంటే అన్నివిధాలా దేవుడే!!!. అలాగైతే జననానికి, మరణానికి, పునరుత్థానానికి దేవుడు అతీతుడు కదా... మరి ఇదంతా ఎందుకు జరిగింది? అన్న ప్రశ్న తప్పక రావాలి.

నాలుగేళ్ల ఒక బాలుడు నీళ్లు పెద్దగా లేని ఒక బావిలో పడ్డాడు. అయ్యో అంటూ జనం బావి చుట్టూ గుమికూడారు. వాడసలే భయకంపితుడై ఉన్నాడు. పైగా పసితనం, అంతా గందరగోళం.. గట్టిగా ఏడుస్తున్నాడు. ఇంతలో ఒకాయన బావి వద్దకొచ్చి లోనికి తొంగి చూశాడు. వెంటనే అక్కడున్న ఒక తాడు తన నడుముకు కట్టుకొని అక్కడున్న వారితో తనను లోనికి దించమన్నాడు. అతన్ని చూసి పిల్లాడు మహదానందంతో 'డాడీ' అని గట్టిగా అరిచి తండ్రిని కరిచి పట్టుకున్నాడు. తండ్రి వాడిని చంకకేసుకొని గట్టిగా కరుచుకొని తమను పైకి లాగమన్నాడు. పిల్లాడు బావిలో పడిపోతే అందరికీ సానుభూతే!! కాని పర్యవసానాలాలోచించకుండా చనిపోయేందుకు కూడా తెగించి కొడుకును కాపాడుకునే శక్తి ఒక్క తల్లి, తండ్రి ప్రేమకు మాత్రమే ఉంటుంది. శుక్రవారం నాడు సిలువలో అదే జరిగింది. పాపిని కాపాడేందుకు పరమ తండ్రి కుమారుడిగా, రక్షకుడుగా చనిపోయేందుకు కూడా సిద్ధపడి యేసుప్రభువు బావిలోకి దూకాడు. నేను చనిపోయినా ఫరవాలేదు, నా కుమారుడు బతికితే చాలు అనుకునేదే నిజమైన తండ్రి ప్రేమ. పరమ తండ్రిలో ఆయన అద్వితీయ కుమారుడు, కుమారునిలో పరమ తండ్రి సంపూర్ణంగా విలీనమైన అపారమైన ప్రేమ ఆ దైవత్వానిది. బావిలోనుండి కొడుకుతో సహా బయటికొచ్చిన సమయమే యేసు మరణాన్నీ గెలిచి సజీవుడైన ఈస్టర్ ఆదివారపు నవోదయం.

నేనే పునరుత్థానాన్ని... నేనే జీవాన్ని

ఆయన ఆరోహణుడు కావడం కళ్లారా చూసిన అనుభవంతో ఆయన అనుచరుల జీవితాలు సమూలంగా పరివర్తన చెందాయి. ఆయన సజీవుడైన దేవుడు అన్న నిత్యసత్యం వారి జీవితాల్లో లోతుగా ప్రతిష్ఠితమై వారంతా ఒక బలమైన చర్చిగా శక్తిగా ఏర్పడి, ఆ తర్వాత సువార్త సత్యం కోసం ప్రాణాలు కూడా త్యాగం చేసేందుకు సంసిద్ధమయ్యే ధైర్యాన్ని వారికిచ్చింది. మరణానికి మనిషిపై పట్టు లేకుండా చేసిన నాటి ఉదంతమే ఈస్టర్ అనుభవం.

యేసుప్రభువు నేనే పునరుత్థానాన్ని, జీవాన్ని అని కూడా ప్రకటించి, తానన్నట్టే చనిపోయి తిరిగి లేవడం ద్వారా తానే జీవాన్నని రుజువు చేసుకున్నాడు. తనలాగే విశ్వాసులు కూడా పురుత్థానం చెంది పరలోకంలో తమ దేవుని సహవాసంలో నిత్య జీవితాన్ని పొందుతారని ప్రభువు బోధించాడు.

– డా. సుభక్త

హెల్త్

సమ్మర్... చైల్డ్ కేర్!

ఎండలు మండిపోతున్నాయి. పిల్లలకు సెలవులూ వచ్చాయి. నీడపట్టున ఉండాల్సిన పిల్లలు కాస్తా సెలవుల్లో ఆడుకోవడం కోసం ఎండల్లోకి వెళ్తే...? అది మరింత ప్రమాదం. ఈ వేసవి వేడిమితో చిన్నారులకు వచ్చే సమస్యలేమిటో, ఈ సెలవుల ఎండల్లోంచి పిల్లలను కాపాడుకోవడం ఎలాగో తెలిపే కథనమిది.



పిల్లలకు ఆటల్లో ఒళ్లు తెలియకపోవడమే కాదు... ఎండ తీవ్రతా తెలియదు. ఇప్పటికే ఎర్రటిఎండ మండుతోంది. ఇంతటి ఎండల తీవ్రత వల్ల ఆరుబయట ఆడే పిల్లలకు వడదెబ్బ మొదలుకొని, డీహైడ్రేషన్ వరకు ఎన్నో సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నీడపట్టున ఉంటే వడదెబ్బ తగలదని కొందరి అభిప్రాయం. కానీ నీడ ఉన్నప్పటికీ అక్కడ వేడిమి తీవ్రత ఎక్కువగా ఉంటే వడదెబ్బ తగిలే ప్రమాదం లేకపోలేదు. వేసవిలో చిన్నారులకు ఎండ ముప్పులు ఏయే రూపాల్లో వస్తాయో చూద్దాం.

ఎండ తీవ్రతతో సమస్యలివి...



మజిల్ క్రాంప్స్: దేహం తన జీవక్రియలను కొనసాగించడానికి మెదడు నుంచి ప్రతి నరానికీ ఆదేశాలు అందుతూ ఉంటాయి. ఈ ఆదేశాలన్నీ లవణాలలోని విద్యుదావేశం కలిగిన అయాన్లు నరాల ద్వారా ప్రసరించడం వల్ల కండరాలకు ఆదేశాలందుతూ ఉంటాయి.

ఎండవేడిమి తీవ్రతతో చెమట రూపంలో నీటినీ, లవణాలనూ కోల్పోవడం వల్ల నరాల ద్వారా మెదడునుంచి కండరాలకు సరైన ఆదేశాలందవు. దాంతో డీ–హైడ్రేషన్‌కు గురి కాగానే కండరాలు బిగుసుకుపోతాయి. వీటినే మజిల్‌క్రాంప్స్‌గా చెబుతారు. మజిల్‌క్రాంప్స్ వస్తే వెంటనే దేహానికి నీటిని అందించాలి.

పిల్లల్లో మజిల్ క్రాంప్స్ వస్తే: పిల్లలకు మజిల్‌క్రాంప్స్ కారణంగా కండరాలు బిగదీసుకుపోతుంటే వారికి 'ఓరల్–రీ–హైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణాన్ని తాగించాలి. • ఓఆర్ఎస్ అందుబాటులో లేకపోతే కొబ్బరినీళ్లు కూడా తాగించవచ్చు. • ఓఆర్ఎస్‌గానీ, కొబ్బరినీళ్లుగానీ అందుబాటులో లేకపోతే... ఒక అరటిపండు తినిపించి, మంచినీళ్లు తాగించాలి. అరటిపండులో పొటాషియం వంటి లవణాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అరటిపండూ, నీళ్లతో అవి చాలా వరకు భర్తీ అవుతాయి.



వడదెబ్బ: ఒక్కోసారి చాలా ప్రాణాంతకంగా మారే మెడికల్ ఎమర్జెన్సీ కండిషన్ ఈ వడదెబ్బ. శరీర జీవక్రియలన్నీ సక్రమంగా జరగడానికి అవసరమైన ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్. కానీ పిల్లలు వడదెబ్బకు లోనైతే వారి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పెరిగిపోతుంది. వాస్తవానికి శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీలు మెయింటెయిన్ అయ్యేందుకు మెదడులోని హైపోథెలామస్ అనే గ్రంథి తోడ్పడుతుంది. దేహ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు చెమటలు పట్టి... దేహంలోంచి ఉష్ణోగ్రతను తీసుకుని ఆ చెమటలు ఆవిరైపోతూ ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత ఒకే స్థాయిలో మెయింటైన్ అవుతుంటుంది. కానీ



దేహ ఉష్ణోగ్రత అదే పనిగా పెరిగిపోతూండటంతో స్వేదగ్రంథులు అలసిపోయి ఇక ఏమాత్రం పనిచేయని స్థితికి చేరుకుంటాయి. దాంతో శరీరం వేడెక్కుతున్నా... దాన్ని నియంత్రిస్తూ ఉష్ణోగ్రత సమంగా ఉండేలా చేయడానికి అవసరమైన యంత్రాంగం విఫలం కావడంతో దేహ ఉష్ణోగ్రత ఇంకా ఇంకా పెరిగిపోతుంది. దీనికి ఓ సూచన కూడా ఉంటుంది. పిల్లల చంకల్లోనూ చెమట పట్టని స్థితి రావడం ఒక్కోసారి పిల్లలు స్పృహ తప్పిపోయి అపస్మారక స్థితికి చేరడం వడదెబ్బను సూచిస్తాయి.

వడదెబ్బలో లక్షణాలివి...

• వికారం; • వాంతులు; • కళ్లు తిరగడం; • నీరసం; • స్పృహ తప్పడం; • ఫిట్స్ రావడం; • చివరగా కోమాలోకి వెళ్లడం జరగవచ్చు.

వడదెబ్బకు చికిత్స: దేహ ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు చేరి అంతకంతకూ పెరుగుతుంటే... ఆ కారణంగా మెదడు, గుండె, మూత్రపిండాలు, కాలేయం వంటి కీలకమైన అవయవాల పనితీరు తీవ్రంగా దెబ్బతింటుంది. అప్పుడు శరీర ఉష్ణోగ్రతను మళ్లీ సాధారణ స్థాయికి (నార్మల్‌కు) తీసుకురావడం అవసరం.

ఒంటి ఉష్ణోగ్రత 100 ఫారెన్‌హీట్‌కు మించుతున్నట్లు తెలియగానే వెంటనే పిల్లలను చల్లటి గాలి సోకేలా ఫ్యాన్ కింద ఉంచాలి. ఫ్యాన్ కింద కూడా వేడిగాలి వస్తుంటే పిల్లల దుస్తులను వదులు చేసి, ఒంటికి చల్లగాలిని బాగా తగలనివ్వాలి. దుస్తులు ఇబ్బందికరంగా ఉంటే నడుముకు చిన్న ఆచ్ఛాదన ఉంచి, బట్టలన్నీ తీసేయాలి. చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో ఒళ్లంతా తుడుస్తూ చల్లటి గాలి ఒంటికి వేగంగా తగులుతూ వెళ్లేలా చూడాలి. ఇలా ఒళ్లు త్వరగా చల్లబడుతుంది.

• ఈ చర్యల తర్వాత కూడా శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే పిల్లల చంకల కింద / గజ్జల దగ్గర ఐస్ గడ్డలనుంచాలి. దాంతో శరీరం మరింత చల్లబడుతుంది. అప్పటికీ శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే, దాన్ని మెడికల్ ఎమర్జెన్సీగా గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

ఎండల్లో పిల్లలు ఎక్కువగా చెమట వల్ల నీరూ, లవణాలూ కోల్పోతున్నారని తెలియడానికి విపరీతంగా చెమట పట్టడమే సూచన అని కొందరు అపోహపడుతుంటారు. అది వాస్తవం కాదు. పిల్లలతో పోలిస్తే పెద్దల్లో చెమట గ్రంథులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఉష్ణోగ్రత పెరగగానే చెమటలు పట్టడం పెద్దల్లోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. కానీ పిల్లల్లో అలా కాదు. వాళ్లలో పెద్దల మాదిరిగా చెమటలు పట్టాలంటే చాలా ఎక్కువ ఉష్ణోగ్రత అవసరం. ఒంటిని చల్లబరిచే మెకానిజమైన చెమట పట్టడమన్నది పిల్లల్లో కాస్త తక్కువే కావడం వల్ల పెరిగే కొద్దిపాటి వేడిమి కూడా పిల్లలపై ఎక్కువగా దుష్ప్రభావం చూపుతుంది. అందుకే పిల్లలకు పెద్దగా చెమటలు పట్టకపోయినా... వాళ్ల ఒంటి ఉష్ణోగ్రత త్వరగా పెరుగుతుందని తెలుసుకోవడంతోపాటు చిన్నపిల్లల్లో చెమట గ్రంథుల సంఖ్య తక్కువ కాబట్టి వేడెక్కిన ఒళ్లు వెంటనే చల్లబడదు కాబట్టి బాగా చల్లగా ఉండేచోటే వాళ్లు ఆడుకుంటూ ఉండేలా చూడాలి. ఆరుబయటి ఉష్ణోగ్రత బాగా తగ్గాకే వారిని బయట ఆటలాడటానికి అనుమతించాలి.

పెద్దల కంటే పిల్లల్లో చెమట గ్రంథులు తక్కువ కాబట్టి...


ఒబేస్ పిల్లలకు జాగ్రత్త అవసరం!

మామూలు పిల్లలతో పోలిస్తే కాస్త ఒబేస్‌గా ఉండే పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆ పిల్లల ఒంట్లోంచి నీళ్లు కోల్పోతున్నప్పుడు ఆ నీటితో పాటు విలువైన ఖనిజలవణాలనూ కోల్పోతున్నారని గ్రహించాలి. స్థూలకాయమున్న పిల్లలు బాగా ఆటలాడుతున్నప్పుడు ప్రతి కిలోకు 50 మిల్లీలీటర్ల నీరు కోల్పోవచ్చు. దాంతో తమ పిల్లలు బరువు కోల్పోతూ, ఆరోగ్యంగా మారుతున్నారంటూ పెద్దలు అపోహ పడటం సరి కాదు. వాళ్లు విలువైన ఖనిజలవణాలు కోల్పోయి డీ–హైడ్రేషన్‌కు గురవుతున్నారనే విషయాన్ని గ్రహించాలి. అందుకే ఇలా బరువు తగ్గుతున్నప్పుడు పెద్దలు వారి ఒంటిలో జరిగే జీవక్రియలకు (మెటబాలిక్ యాక్టివిటీస్‌కు) అవసరమైన నీటిని వెంటవెంటనే భర్తీ చేస్తూ ఉండాలి. అందుకే స్థూలకాయులైన పిల్లలు వెంటవెంటనే మరింత బరుతు తగ్గుతున్నట్లు గ్రహిస్తే పెద్దలు వారి ఒంట్లోకి తగిన ఎలక్ట్రోలైట్స్ పంపించేందుకు కొబ్బరినీళ్లు, గ్లూకోజ్ వంటివి ప్రతి 20 నిమిషాలకొకసారి తాగిస్తూ ఉండటం తప్పనిసరి.

ఎండ దుష్ప్రభావాల నివారణ ఇలా...

• ఎండవేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇంట్లోని చల్లటి ప్రదేశాల్లోనే ఆడుకునేలా ప్రోత్సహించాలి. • ఎండవేళల్లో ఇన్‌డోర్ గేమ్స్‌కు మాత్రమే వారిని పరిమితం చేస్తే బాగుంటుంది. • ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారిని ఇంట్లోనే, అందునా ఇంట్లో కూడా చల్లగా ఉండే ప్రదేశాల్లోనే ఉండేలా చూడాలి. • ఆటల్లో పూర్తిగా నిమగ్నమైపోయిన పిల్లలు తరచూ మంచినీళ్లు తాగక పోవచ్చు. అందుకే తరచూ వారు కొద్దికొద్దిగా మంచినీళ్లు తాగుతుండేలా చూడాలి. వీలైతే మధ్య మధ్యలో కొబ్బరినీళ్లు, పళ్లరసాలు కూడా ఇవ్వవచ్చు.

ఇలాంటి కొద్దిపాటి జాగ్రత్తలతో పిల్లలు వేసవి దుష్ప్రభావాలకు లోనుకాకుండా జాగ్రత్త పడాలి. సాయంత్రాలు బాగా చల్లబడ్డ తర్వాతనే వాళ్లను ఔట్‌డోర్ గేమ్స్‌కు అనుమతించాలి.



డా॥ శివనారాయణ రెడ్డి వెన్నపూస,
సీనియర్ నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్

ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకుంటున్నారా?

గతంలో గర్భధారణ (ప్రెగ్నెన్సీ) ప్లానింగ్ అంటూ ఏదీ ఉండేది కాదు. నిజానికి తమకు కావాల్సినప్పుడు, తమకు అవసరమైన సమయంలోనే ప్రెగ్నెన్సీ వచ్చేలా ప్లాన్ చేసుకుంటే... అది వచ్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కాబోయే తల్లికీ, పుట్టబోయే బిడ్డకూ చాలా ప్రయోజనాలు ఉంటాయి. తల్లీ బిడ్డా సురక్షితంగా కూడా ఉంటారు. సరైన ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌తో ప్రయోజనాలెలా కలుగుతాయో తెలుసుకుందాం.

గతం తరం యువతుల్లో తమకు ప్రెగ్నెన్సీ వచ్చిన విషయం నెల తప్పిన తర్వాత గానీ తెలిసేది కాదు. అప్పుడు... తమకు పెగ్నెన్సీ వచ్చిందా లేదా అని తెలుసుకోవడం కోసం ఇంట్లోనే కొన్ని పరీక్షలు చేసుకునేవారు. అయితే గర్భధారణను ముందే ప్లాన్ చేసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లల్లో కొన్ని లోపాల నివారణకు ముందునుంచే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న మహిళ తాము నెల తప్పాలనుకున్న మూడు నెలల ముందు నుంచే ఫోలిక్ యాసిడ్ అనే పోషకాన్ని తీసుకోవడం వల్ల ప్రయోజనాలుంటాయి. మార్కెట్‌లో మాత్రల రూపంలో దొరికే ఈ ఫోలిక్ యాసిడ్ చాలా చవక. నిజానికి పాలకూర లాంటి ఆకుకూరల్లో అది సమృద్ధిగా ఉంటుంది. పిండంలో వచ్చేందుకు అవకాశమున్న న్యూరల్ ట్యూబ్ (వెన్నుపాము) లోపాలను అది అరికడుతుంది. పుట్టుకతో వచ్చే ఈ వెన్నుపాము



లోపాలను స్పైనాబైఫిడా అంటారు. ఫోలిక్ యాసిడ్ ఇలాంటి అనేక ప్రెగ్నెన్సీ లోపాలను అరికడుతుంది కాబట్టి ప్రెగ్నెన్సీని ప్లాన్ చేసుకున్న మహిళలకు మూడు నెలల ముందునుంచే ఆబ్‌స్టెట్రీషియన్స్/ గైనకాలజిస్టులు ఫోలిక్ యాసిడ్ మాత్రలను సూచిస్తుంటారు. ప్రెగ్నెన్సీ ప్లానింగ్ వల్ల స్పైనా బైఫిడా మాత్రమే కాకుండా పోషకాహార లోపాల వల్ల పిండదశలో ఎదురయ్యే మరెన్నో సమస్యలూ నివారించవచ్చు. అంతేకాదు... దేశంలోని మహిళల్లో దాదాపు 59 శాతం మందిలో రక్తహీనత (అనీమియా) ఎక్కువ. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునే మహిళకు ఐరన్ సప్లిమెంట్లు ఇవ్వడం ద్వారా కూడా కాబోయే తల్లీ, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంది.

గర్భం ప్లాన్ చేసుకున్న నాటి నుంచి మహిళకు అన్ని పోషకాలూ అందేలా ఆరోగ్యకరమైన సమతులాహారాన్ని ఇవ్వడం, అందులో కూరగాయలు, ఆకుకూరలు, తాజాపండ్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలతో ఇటు కాబోయే తల్లి, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ఆ చిన్నారికి తగినంత రోగనిరోధక శక్తి సమకూరేలా జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశముంటుంది.



డా॥ స్వప్న సముద్రాల
సీనియర్ గైనకాలజిస్ట్ అండ్ ఆబ్‌స్టెట్రీషియన్